సాక్షి
జోగులాంబ గద్వాల

మంగళవారం ; 27 ; ఆగస్టు ; 2024



నిరంతర విద్యుదుత్పత్తి

జూరాల జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి నిరంతరాయంగా కొనసాగుతోంది.

వివరాలు 8లో ▸



ముగిసిన బాస్కెట్‌బాల్ టోర్నీ

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీలో మేడ్చల్, హైదరాబాద్ జట్లు విజేతగా నిలిచాయి.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.6 /23.5

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

నేడు జిల్లా ఆస్పత్రి డాక్టర్‌తో
'సాక్షి' ఫోన్ ఇన్



డా.నరసింహులు, జిల్లా ఆస్పత్రి, గద్వాల

గద్వాల క్రైం: వైరల్ ఫీవర్, డెంగీ, చికున్ గున్యా ఇతర జ్వరాల బారిన ప్రజలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో సీజనల్ వ్యాధులకు సంబంధించి మంగళవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జిల్లా ఆస్పత్రి వైద్యుడు నరసింహులుతో 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. డెంగీతో పాటు ఇతర జ్వరాలతో ప్లేట్‌లెట్స్ కౌంట్ తగ్గిపోవడం, జ్వరం తగ్గిన తర్వాత కూడా బాధితులు నీరసించి పోవడం వంటి సమస్యలపై వైద్య సలహాలు, సూచనల కోసం 'సాక్షి' ఫోన్ ఇన్ ద్వారా డాక్టర్‌ను ప్రజలు సంప్రదించవచ్చు.

సాక్షి ఫోన్ ఇన్

తేదీ : 27-08-2024 మంగళవారం
సమయం: ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్ :
8328218688

గద్వాలలో హైడ్రా ప్రకంపనలు

రూ.కోట్ల విలువైన భూములు, పదిశాతం స్థలాలు అన్యాక్రాంతం

- జిల్లాలకు సైతం ఈ విధానాలు విస్తరింపజేయాలని ఎమ్మెల్యేలు సీఎంకు లేఖలు
- సంగాల, జములమ్మ చెరువు శిఖం భూములు కబ్జా
- సిద్ధాంతకుంటపై అక్రమార్కుల కన్ను
- అమలుకు నోచుకోని హైకోర్టు ఆదేశాలు



కబ్జాకు గురైన జములమ్మ చెరువు శిఖం భూమి



సంగాల చెరువు శిఖం భూమి..

గద్వాల: చెరువులు.. కుంటలను కబ్జా చేసి విలాసవంతమైన ఫాంహౌజ్‌లు, భవంతులు నిర్మించగా హైదరాబాద్‌లో హైడ్రా దెబ్బకు పేకమేడల్లా నేలమట్టమవుతున్నాయి. దీంతో ఇంతకాలం 'ఉన్నోడికి చట్టం జేబులో చుట్టం' అనే నానుడిని మరిపిస్తూ జరుగుతున్న హైడ్రా దాడులతో గద్వాలలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఇక్కడ సైతం అక్రమార్కుల అవతారమెత్తి రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాలను కొందరు బడా బాబులు కబ్జా చేయగా.. హైడ్రా దాడుల నేపథ్యంలో వీరి వెన్నులో వణుకు పుట్టుకుంది. జిల్లా కేంద్రంలో ఇప్పటికే రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూములు కబ్జా చేశారు. గతంలో విలువైన ప్రభుత్వ పది శాతం ఓపెన్ స్థలాలను కుల సంఘాలకు, ప్రార్థన మందిరాలకు కేటాయించడాన్ని సవాల్ చేస్తూ కొందరు హైకోర్టును ఆశ్రయించగా వెంటనే వాటిని స్వా. దీనం చేసుకోవాలని కోర్టు ఆదేశించింది. అయినా అవి అమలుకు నోచుకోలే. ఈ నేపథ్యంలో గద్వాలలో సైతం హైడ్రా తరహాలో దాడులు నిర్వహించి ప్రభుత్వ స్థలాలను కాపాడాలంటూ పెద్ద ఎత్తున డిమాండ్ వ్యక్తమవుతుంది.

రూ.కోట్ల విలువైన స్థలాలు కబ్జా

జిల్లా కేంద్రంలోని భీంనగర్, బీరెల్లి చౌరస్తా, కుంట వీధి, సుంకులమ్మమెట్టు, వేణుకాలనీ, సెకండ్ రైల్వేగేటు వంటి ప్రధాన ప్రాంతాల్లోని రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాలతో పాటు, పదిశాతం ఓపెన్ స్థలాలు కూడా కొందరు అక్రమార్కుల చెరలో బందీగా మారాయి. గత ప్రభుత్వ హయాంలో వివిధ కులసంఘాలు, మతాలకు సంబంధించిన వర్గాలకు విలువైన పదిశాతం ఓపెన్ స్థలాలను ధారదత్తం చేశారు. వాస్తవానికి పదిశాతం ఓపెన్ స్థలాలు కేవలం ఆయా ప్రాంతాల్లోని కాలనీ వాసులకు ఆహ్లాదకరమైన పార్కులు, ఆటస్థలాలకు మాత్రమే వినియోగించాలని హైకోర్టు స్పష్టమైన తీర్పునిచ్చింది. కానీ గద్వాలలో మాత్రం వీటికి విరుద్ధంగా ఇష్టానుసారంగా కులసంఘాలు, మత వర్గాలకు పదిశాతం స్థలాలు కట్టబెట్టడం విశేషం.

■ గద్వాల పట్టణాన్ని ఆనుకొని సంగాల, జములమ్మ చెరువులున్నాయి. ఈప్రాంతాల్లో ఎకరం భూమి విలువ రూ.3 కోట్ల నుంచి రూ.4కోట్ల వరకు ఉంటుంది. ఇలాంటి విలువైన ప్రాంతంలో కొందరు అక్రమార్కులు రెండు చెరువుశిఖం స్థలాలను కొంతమేర ఆక్రమించి దర్జాగా జెండా పాతారు. వాస్తవానికి చెరువులున్న స్థలాల్లో బఫర్ జోన్‌గా భావించే ఎఫ్‌టీఎల్(ఫుల్ ట్యాంక్ లెవెల్) పరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. కానీ సంగాల చెరువులో శిఖం భూమిని కొంత మేర కబ్జా చేసి కొందరు అక్రమార్కులు దర్జాగా ప్లాట్లు చేసి క్రయవిక్రయాలు జరపడం విశేషం. అదేవిధంగా జములమ్మ చెరువు పరిధిలో కొంత మేర భూములను ఆక్రమించి వాటిలో కబ్జాదారులు జెండా పాతారు.

■ గద్వాల మండల పరిధిలో సిద్ధాంతవారి కుంటకు సంబంధించి 9ఎకరాల భూమి ఉంది. ఈ ప్రాంతంలో ఎకరం భూమి రూ.5కోట్ల వరకు ధర పలుకుతుంది. ఈ భూమిని కబ్జా చేసేందుకు ఏకంగా రికార్డులనే తారుమారు చేసేందుకు గత ప్రభుత్వ హయాంలో కొందరు బడాబాబులు యత్నించారు. వీరికి గతంలో ఇక్కడ పనిచేసి ఓ రెవెన్యూ డివిజన్ అధికారి సహకరించారు. అదేవిధంగా ఈ 9ఎకరాల్లో మట్టిమాఫియా ఇష్టానుసారంగా మట్టిని తవ్వేసి సొమ్ముచేసుకుంది.

అమలుకు నోచుకోని హైకోర్టు ఉత్వర్వులు

నిబంధనలకు విరుద్ధంగా కుల, మతాలకు వర్గాలకు ఓపెన్ స్థలాలు కట్టబెట్టడం చట్టవిరుద్ధమని పేర్కొంటూ గద్వాల పట్టణానికి చెందిన ఓ ప్రైవేటు కాలేజీ యజమాని రవీందర్‌రెడ్డి కేసులో హైకోర్టు తీర్పునిచ్చింది. అన్యాక్రాంతమైన ప్రభుత్వ ఓపెన్ స్థలాలను స్వాధీనం చేసుకుని అందులో చేపట్టిన నిర్మాణాలను కూల్చివేయాలని అధికారులను ఆదేశిస్తూ ఉత్తర్వులో స్పష్టంగా పేర్కొంది. స్పందించిన మున్సిపల్ అధికారులు కులసంఘాలు, మత వర్గాల ప్రతినిధులకు జూలై 22వ తేదీన నోటీసులు జారీ చేసి చేతులు దులిపేసుకున్నారు తప్పితే హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను మాత్రం అమలు చేయలేకపోయారని విమర్శలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి.

భూములను రక్షించాలి

గద్వాలలో ఎంతో విలువైన ప్రభుత్వ భూములు, పదిశాతం ఓపెన్ స్థలాలు అక్రమార్కుల చేతుల్లో బందీ అయ్యాయి. వీటిపై హైడ్రా తరహాలో దాడులు నిర్వహించి సంరక్షించాలి. అదేవిధంగా అక్రమాలకు పాల్పడిన ఎంతటివారైన సరే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి. – మోహన్‌రావు, సీనియర్ సిటీజన్స్ ఫోరం అధ్యక్షుడు

చర్యలు తీసుకుంటాం

గద్వాల మున్సిపాలిటీలో వివిధ కులసంఘాలు, మతవర్గాలకు ఇచ్చిన ఓపెన్ స్థలాల ప్రతినిధులకు నోటీసులు ఇచ్చాం. అయితే ఇందులోని కొన్ని నిర్మాణాలకు ఎంపీ, ఎమ్మెల్యేల నిధులు వెచ్చించారు. ప్రభుత్వం సొమ్ముతో చేపట్టిన నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. అదేవిధంగా చెరువులు, కుంటలు కబ్జాకు గురైతే వాటిని గుర్తించి స్వాధీనం చేసుకుంటాం. చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. – బీఎం సంతోష్, కలెక్టర్



కృష్ణాష్టమి వేడుకలు

జిల్లాలో కృష్ణాష్టమి వేడుకలు అంబరాన్నంటాయి. సోమవారం వేణుగోపాలస్వామి తదితర ఆలయాల్లో శ్రీకృష్ణుడిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అలాగే, శ్రీకృష్ణుడు, సత్యభామ వేషధారణలతో చిన్నారులు ర్యాలీలు నిర్వహించారు. ప్రత్యేకంగా నిర్వహించిన ఉట్టికొట్టే పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

- వివరాలు 9లో..

న్యూస్‌రీల్

సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకోవాలి



గద్వాల టౌన్: భారతీయ సంస్కృతిని దెబ్బతీయడానికి కొన్ని శక్తులు కుట్ర పన్నుతున్నాయని.. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని... భారతీయ సంస్కృతి ద్వారానే సమాజంలో ప్రేమ, సుఖ సంతోషాలు సాధ్యమని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు అల్లూరి ఫణిమోహన్‌రావు పేర్కొన్నారు. కృష్ణాష్టమిని పురస్కరించుకొని సోమవారం వీహెచ్‌పీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఫిరంగి చౌరస్తాలో ఓం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రపంచంలోని గొప్ప గొప్ప దేశాలు కూడా నేడు హిందూధర్మాన్ని ఆచరించడానికి ఆసక్తి చూపుతున్నాయని, హిందూ సమాజం ద్వారానే లోక కళ్యాణం సిద్ధిస్తుందన్నారు. హిందువుల ఐక్యతే వీహెచ్‌పీ లక్ష్యమని చెప్పారు. ఓంకారం అన్ని మతాలకు మూల చిహ్నమని పేర్కొన్నారు. అనంతరం రామాయణం, భారతంలోని విశేషాలను వివరించారు. ఆనంద్, గట్టుఈశ్వరయ్య, ఆలూరు రాము, మల్లికార్జున్ సాక్రే, శ్రీకాంత్, మనోజ్, బాస్కర్, మురళీకృష్ణ, ఎల్లారి రామ్‌మోహన్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి సన్నిధిలో పేట కలెక్టర్



ధరూరు: మండలంలోని పెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి ఆలయంలో నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం కలెక్టర్, ఆమె కుటుంబ సభ్యులు ఆలయానికి చేరుకోగా.. ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు.

షరామామూలు

పరిశ్రమలు వెదజల్లుతున్న వాయు, జల కాలుష్యంతో పోలేపల్లి సెజ్ పరిసర ప్రాంతాల్లోని ప్రజల జీవనం అగమ్యగోచరంగా తయారైంది. పలు ఫార్మా కంపెనీలు వర్షాకాలంలో వరద మాటున వ్యర్థజలాలను బయటకు వదలడం ప్రతి ఏటా షరా మామూలు కాగా.. ఈసారి పెద్ద ఎత్తున పంపింగ్ చేస్తుండడం బెంబేలెత్తిస్తోంది. రసాయనాలతో కలిసి విషతుల్యమైన జలాన్ని నేరుగా బయటకు వదులుతున్నా.. ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. నిబంధనలు తుంగలో తొక్కి ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్న పరిశ్రమలపై చర్యలు తీసుకోకుండా మీనమేషాలు లెక్కిస్తున్న కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ)తో పాటు జిల్లా యంత్రాంగం నిర్లక్ష్య వైఖరిపై సైతం విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

వరద మాటున విష జలాలు



వర్షం సాకుతో వదిలిన కాలుష్యపు జలం వరదను తలపిస్తున్న దృశ్యం

- కాలుష్యమయంగా పోలేపల్లి సెజ్ పరిసరాలు
- నిబంధనలు విస్మరించి రెచ్చిపోతున్న పలు ఫార్మా పరిశ్రమలు
- వర్షం సాకుతో వ్యర్థ జలాలను బయటకు వదులుతున్న నిర్వాహకులు
- ఆ నీటితోనే నిండిన వ్యవసాయ పొలాలు, గుండ్లగడ్డ తండా, పల్లె చెరువులు
- కానరాని పీసీబీ.. పట్టించుకోని జిల్లా అధికారులు

పోలేపల్లి సెజ్‌లో సుమారు 12 వరకు ఫార్మా కంపెనీలు, మరో ఎనిమిది వరకు ఇతర పరిశ్రమలు ఉన్నాయి. ప్రధానంగా ఫార్మా కంపెనీల నిర్వాహకులు ఎవరికీ అనుమానం రాకుండా వ్యర్థ జలాలను బయటకు పంపిస్తున్నారు. వర్షం పడిన రోజు వరద సాకుతో ఎక్కువ మొత్తంలో.. ఒక్కో రోజు రాత్రి వేళల్లో దొంగచాటుగా వదులుతుండగా పంట పొలాలతో పాటు చెరువులు, కుంటల్లోకి ఆ నీరు చేరుతోంది. దీనిపై గతేడాది రాజాపూర్ మండల పరిధిలోని రాయపల్లి, ముదిరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన రైతులు పలు మార్లు పీసీబీకి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అధికారులు వచ్చి రైతుల పొలాల్లో నిలిచిన నీటి నమూనాలు సేకరించి వెళ్లిపోయారు. కానీ ఒక్క పరిశ్రమపైనా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. తాజాగా వర్షం మాటున పలు ఫార్మా కంపెనీలు వ్యర్థ జలాలను బయటకు వదులుతున్నా.. ఎవరూ పట్టించుకున్న పాపానపోవడం లేదు. దీనిపై గతంలో రైతులు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించగా.. కాలుష్యం వెదజల్లుతున్న పరిశ్రమలకు మొట్టికాయలు వేసి.. రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఆదేశాలు ఇచ్చింది. అయినా ఆయా పరిశ్రమల యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. దీనికి సంబంధించి 2014 నుంచి ఫిర్యాదులు చేస్తూనే ఉన్నా.. పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫిర్యాదులు చేస్తున్నా.. చర్యలు శూన్యం

గ్రౌండ్ రిపోర్ట్



ఓ పరిశ్రమ నుంచి ముదిరెడ్డిపల్లి చెరువులోకి వదిలిన కాలుష్యపు నీరు

ఊళ్లను వదిలేసే పరిస్థితి..

ప్రధానంగా ఫార్మా పరిశ్రమలు వదులుతున్న వ్యర్థ జలాలలతో రాజాపూర్ మండలం రాయపల్లి, ముదిరెడ్డిపల్లి, నందిగామ, జడ్చర్ల మండలం పోలేపల్లి, గుండ్లగడ్డ తండా పరిసర గ్రామాల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామాల శివారుల్లోని వ్యవసాయ భూముల్లో పంటల పండని పరిస్థితి ఉంది. జలకాలుష్యంతో బోర్లు, బావులు, చెరువులు, కుంటల్లోని నీరు రంగుమారగా.. తాగడానికి వీల్లేకుండా పోయింది. చెరువుల్లోని చేపలతో పాటు ఆవులు, గేదెలు మృత్యువాత పడిన ఘటనలు ఉన్నాయి. పరిశ్రమలు వస్తే తమ పిల్లల బతుకులు బాగుపడతాయని ఆశపడ్డామని.. ఇప్పుడు ఉపాధి సంగతి దేవుడెరుగు.. పరిశ్రమలు వదిలే కాలుష్యం వల్ల ఉన్న ఊళ్లను వదిలే పరిస్థితి నెలకొందని ఆయా గ్రామస్తులు వాపోతున్నారు.

తండాను వదిలి ఎక్కడికిపోవాలో..



మా తండాకు కాలుష్యపు నీటిని వదులుతుండడంతో రోగాల బారిన పడుతున్నాం. కంపెనీలు రాకముందు తండాలోని బోర్లు, మా వ్యవసాయ బోర్ల నీటిని తాగేవాళ్లం. ఇప్పుడు బోర్ల నీటిని చుక్క కూడా నాలుకపై వేసుకోలేం. చర్మ వ్యాధులు వస్తున్నాయి. పశువులు మృతి చెందుతున్నాయి. మా బాధలను అందరికీ చెప్పుకున్నాం. ఎవరూ న్యాయం చేయడం లేదు. తండాను వదిలి ఎక్కడికిపోవాలో.. ఏమో మరి.

– లక్ష్మణ్ నాయక్, రైతు, గుండ్లగడ్డ తండా

కంపు వాసన భరించలేకపోతున్నాం..



ప్రతి రోజు కంపెనీల నుంచి వెలువడే కంపు వాసన భరించలేకపోతున్నాం. మా ఊళ్లో బోర్ల నీటిని తాగలేక.. మినరల్ నీళ్లు కొనుక్కుని తాగుతున్నాం. వాన వచ్చిందంటే చాలు మా పొలాల్లోకి కంపు వాసనతో కూడిన కాలుష్యపు నీళ్లు వదులుతున్నారు. భూములు దెబ్బతిన్నాయి. నీళ్లు పాడైనయ్. పీసీబీకి ఫిర్యాదు చేస్తే మాకు న్యాయం చేయకపోగా.. వారు పండుగ చేసుకుంటున్నారు. మా బాధలు ఎవ్వరికీ చెప్పుకోవాలో తెలియడం లేదు.

– కుర్వ రాజు, రైతు, పోలెపల్లి

నామ్స్ ప్రకారం రన్ చేయాలి..



పరిశ్రమలను నామ్స్ ప్రకారం రన్ చేయాలి. ఖర్చు ఎక్కువగా వస్తదని.. ప్రజలకేమైనా కానియ్యండి అనే రీతిలో పోలేపల్లి సెజ్‌లో పలు పరిశ్రమలు వదులుతున్న కాలుష్యంతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొల్యూషన్ ఉందని ప్రభుత్వ వ్యవసాయశాఖ అధికారులు ఇచ్చిన రిపోర్టులు ఉంటే.. పీసీబీ వాళ్లు మాత్రం లేదంటూ రిపోర్టులు ఇస్తారు. ఇదెక్కడి న్యాయం? నాకు ప్రజలే ముఖ్యం. వారికోసం ఎంత వరకైనా పోరాడుతా.

– జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే



ఓ పరిశ్రమ నుంచి వెలువడుతున్న వాయుకాలుష్యం

టెన్షన్.. టెన్షన్..

- కొనసాగుతున్న కాల్వ తవ్వకం పనులు
- గ్రామం వైపు ముంచుకొస్తున్న రిజర్వాయర్ నీరు
- ఆందోళనలో చిన్నోనిపల్లె ముంపు గ్రామస్తులు

గట్టు: చిన్నోనిపల్లె ముంపు గ్రామస్తులకు టెన్షన్ తప్పడం లేదు. అధికార యంత్రాంగం రిజర్వాయర్ కట్ట వెంట కాల్వ తవ్వకం పనులను కొనసాగిస్తుండగా, మరో వైపు గ్రామానికి రెండు వైపులా ఉన్న వాగుల్లోని వర్షపు నీరు రిజర్వాయర్‌లోకి వచ్చి చేరుతుండడంతో చిన్నోనిపల్లె ముంపు గ్రామస్తులు భయంతోనే జీవనం సాగిస్తున్నారు. చిన్నోనిపల్లె రిజర్వాయర్ కట్ట గ్యాప్‌ను పూడ్చి వేసిన నేపథ్యంలో రిజర్వాయర్‌లోని నీరు బయటకు వెళ్లకుండా ఆగిపోతున్నాయి. ఇలా అగిన నీటికి తోడు వర్షాల వలన చిన్నోనిపల్లె గ్రామానికి రెండు వైపులా ఉన్న వాగుల్లోని వర్షపు నీరు అలానే వస్తుండడంతో ముంపు గ్రామం వైపు రిజర్వాయర్ బ్యాక్ వాటర్ ముందుకు దూసుకువస్తున్నాయి. దీంతో ముంపు గ్రామస్తులు బిక్కు బిక్కు మంటూ కాలం గడుపుతున్నారు. ఇప్పటికే రిజర్వాయర్‌లోని బ్యాక్ వాటర్ డంపింగ్ యార్డు వరకు చేరుకోగా, సోమవారం కిందిగేరిలోని సింగల్‌ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న చోటుకు చేరుకున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రిజర్వాయర్ నీరు వచ్చి చేరుకున్నాయి. విద్యుత్ సరఫరా ఆగిపోతే నీటిలోనే నడుచుకుంటూ వెళ్లి మరమ్మతు చేసే పరిస్థితి నెలకొన్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. మరో వైపు వ్యవసాయ పొలాలకు వెళ్లాలంటే నీటిలోనే నడుచుకుంటూ వెళుతున్నట్లు ముంపు గ్రామస్తులు వాపోయారు. రిజర్వాయర్ నీటిని త్వరగా బయటకు పంపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని నిర్వాసితులు కోరుతున్నారు.



చిన్నోనిపల్లె గ్రామం సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ కట్ట చుట్టూ చేరిన రిజర్వాయర్ నీరు

ఆటోలపై పోలీసుల స్పెషల్ డ్రైవ్

- పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న వారికి జరిమానా
- పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద విస్తృత తనిఖీలు



పరిమితికి మించి ఆటోలో ప్రయాణిస్తున్న కూలీలతో మాట్లాడుతున్న సీఐ రవిబాబు

అలంపూర్: పరిమితికి మించి కూలీలను తరలిస్తున్న ఆటోలపై పోలీసులు కొరఢా ఝుళిపించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా పరిమితికి మించి కూలీలను తరలిస్తున్న ఆటోలను గుర్తించి కేసులు నమోదు చేశారు. అలంపూర్ చౌరస్తా సమీపంలోని పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద అలంపూర్ సీఐ రవిబాబు, ఉండవెల్లి ఏఎస్‌ఐ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఆటోలను తనిఖీ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి కూలీలతో రాష్ట్రంలోకి అనేక ఆటోలు వస్తున్నాయి. నిత్యం ప్రమాదాలు సంభవిస్తుండటంతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఏపీ రాష్ట్రం నుంచి దాదాపు 20 నుంచి 25 వరకు ఆటోల్లో కూలీలు అలంపూర్ ప్రాంతానికి వస్తుండగా.. ఒక్కో ఆటోలో 15 నుంచి 25 మంది కూలీలు ఉన్నట్లు గుర్తించారు. ఆటోలను మైనర్ బాలురు సైతం నడుపుతున్న విషయం వెలుగు చూడటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్లు, ప్రయాణికులతో సమావేశం నిర్వహించి ప్రమాదాలపై వారికి అవగాహన కల్పించారు. ఈ నెల 15వ తేదీన కర్నూల్ జిల్లా ఈ–తాండ్రపాడు గ్రామంలోని భరత్ నగర్‌కు చెందిన కూలీల ఆటో ప్రమాదం, నలుగురి మృతి గురించి వివరించారు. నిబంధనలు పాటించని ఆటో డ్రైవర్లపై కేసులు నమోదు చేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. పరిమితికి మించి కూలీలతో వస్తే ఆటో సీజ్ చేసి కోర్టుకు పంపుతామని హెచ్చరించారు. ప్రమాదాల నుంచి అప్రమత్తత అవసరమన్నారు. కానిస్టేబుల్స్ హుసేన్, నర్సింహ్ములు, నగేష్ ఉన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



రాజు (ఫైల్)

తాడూరు: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని పాపగల్ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. పాపగల్ చెందిన రాజు (26) బైక్‌పై శిర్సవాడకు వస్తుండగా పాపగల్ సమీపాన ఉన్న గేదెల షెడ్ వద్ద బొలెరో వాహనానికి ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్‌గా పనిచేసుకుంటూ జీవనం కొనసాగించే రాజు మృతి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, 2 నెలల చిన్నారి ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహేష్ తెలిపారు.

వాగులో పడి వ్యక్తి..

కేటీదొడ్డి: వాగులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం కర్ణాటక రాష్ట్రం యాపల్‌దిన్నె వాగులో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన రాధయ్య (45) కొన్ని రోజుల క్రితం ఇంటి నుంచి కనిపించకుండా వెళ్లిపోయాడు. సోమవారం కర్ణాటక రాష్ట్రం యాపల్‌దిన్నె వాగులో పడి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. మద్యానికి బానిసై రాధయ్య మత్తులో వాగులో పడి మృతి చెందాడా? లేదా అనే కోణంలో కర్ణాటక పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య

మహబూబ్‌నగర్ క్రైం: రైలు కిందపడి గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్‌ఐ సయ్యద్ అక్బర్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని బండమీదిపల్లి సమీపంలో ఉన్న రైల్వేట్రాక్‌పై గుర్తు తెలియని యువకుడు(26) సోమవారం సాయంత్రం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి ఛాతీపై పవన్ అనే పచ్చబొట్టు ఉందని, ఇతర వివరాలు ఏం లభించలేదని వెల్లడించారు. మృతుడికి సంబంధించిన కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే రైల్వే పోలీసులను సంప్రదించాలని తెలిపారు. మృతదేహం జిల్లా జనరల్ ఆస్పత్రి పోస్టుమార్టం గదికి తరలించినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

ఇంట్లో చోరీ.. బంగారం, వెండి అపహరణ

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రలో ఓ ఇంట్లో చోరీ జరిగిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. జిల్లా కేంద్రానికి చెందిన ఓంకార్ హౌసింగ్‌బోర్డు కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఈనెల 21న ఏపీలోని ఆదోనిలో శుభకార్యానికి వెళ్లాడు. కాగా ఇంటి తాళం విరగొట్టి బీరువాలోని 7తులాల బంగారు ఆభరణాలతో పాటు 70తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఓంకార్ ఆదివారం రాత్రి ఇంటికి రావడంతో తలుపులు తెరిచి ఉండటం గమనించి సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. క్లూస్‌టీం సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

చెట్టును ఢీకొన్న బైక్: వ్యక్తికి తీవ్ర గాయాలు

ఎర్రవల్లి: వర్షానికి రోడ్డుపై పడి ఉన్న చెట్టును బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా.. గద్వాల మండలంలోని జంగంపల్లికి చెందిన పంచలింగ తన బైక్‌పై ఎర్రవల్లి నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో రాత్రి కురిసిన వర్షానికి ఎర్రవల్లి–గద్వాల రోడ్డులో నంది గోశాల సమీపంలో రోడ్డుపై అడ్డంగా పడి ఉన్న చెట్టును గమనించక తన బైక్‌తో ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి కర్నూల్ తరలించారు.

చాంపియన్లుగా హైదరాబాద్, మేడ్చల్



బాలుర విభాగం చాంపియన్ హైదరాబాద్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, డీఎస్పీ వెంకటేశ్వర్లు తదితరులు



ట్రోఫీ అందుకుంటున్న బాలికల విభాగం చాంపియన్ మేడ్చల్ మల్కాజ్‌గిరి జట్టు

హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లు

- రన్నరప్‌గా నిలిచిన వికారాబాద్ జట్లు
- ముగిసిన రాష్ట్రస్థాయి అండర్–16 బాస్కెట్‌బాల్ టోర్నీ

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో సోమవారం రాష్ట్రస్థాయి అండర్–16 (యూత్) బాస్కెట్‌బాల్ టోర్నీలో చాంపియన్లుగా బాలుర విభాగంలో హైదరాబాద్ జట్టు, బాలికల విభాగంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి జట్లు నిలిచాయి. బాల, బాలికల విభాగాల్లో వికారాబాద్ జట్లు రన్నరప్ స్థానాలను దక్కించుకోగా, మూడోస్థానంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి బాలుర విభాగం, బాలికల్లో రంగారెడ్డి జట్లు నిలిచాయి.

చివరి వరకు ఉత్కంఠ

బాలుర, బాలికల విభాగం ఫైనల్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. ఆయా జట్లు నువ్వానేనా అనే రీతిలో తలపడ్డాయి. ఉత్కంఠంగా చివరి వరకు సాగిన బాలుర విభాగం ఫైనల్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు 57–53 పాయింట్ల తేడాతో వికారాబాద్ జట్టుపై విజయం సాధించింది. అదేవిధంగా బాలికల ఫైనల్ మ్యాచ్‌లో మేడ్చల్ మల్కాజ్‌గిరి జట్టు 58–56 పాయింట్ల తేడాతో వికారాబాద్ జట్టుపై గెలుపొందింది. బాలుర విభాగం మూడోస్థానం మ్యాచ్‌లో మేడ్చల్ జట్టు 50–40 పాయింట్ల తేడాతో రంగారెడ్డి జట్టుపై, బాలికల మూడోస్థానం మ్యాచ్‌లో రంగారెడ్డి జట్టు 35–7 పాయింట్ల తేడాతో హైదరాబాద్ జట్లపై విజయాలు నమోదు చేసుకున్నాయి.

ట్రోఫీలు అందజేసిన మున్సిపల్ చైర్మన్, డీఎస్పీ

టోర్నీలో విన్నర్, రన్నరప్, మూడోస్థానం జట్లకు మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీనియర్ న్యాయవాది మనోహర్‌రెడ్డి ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికితీయడానికి ఇలాంటి టోర్నీలు ఎంతగానో దోహదపడుతాయని తెలిపారు. ఇలాంటి టోర్నీలు మరిన్ని నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో సీఐ అప్పయ్య, రాష్ట్ర బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నార్మన్ ఐజాక్, జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మక్సూద్‌బిన్ అహ్మద్ జాకీర్, నసరుల్లా హైదర్, జిల్లా వాలీబాల్ సంఘం ప్రతినిధి చెన్న వీరయ్య, కౌన్సిలర్లు రామ్, సాదతుల్లా హుస్సేనితోపాటు మీర్ అర్షద్‌అలీ, ఇలియాజ్, ఖాలెద్‌అలీ, ఖలీల్, సుబాన్‌జీ, ముక్రం తదితరులు పాల్గొన్నారు.

అలంపూర్‌లో ఆధ్యాత్మిక వాతావరణం



ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



రథోత్సవంలో అర్చకులు

ఘనంగా వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర ఆలయాలు సోమవారం ఆధ్యాత్మిక వాతావరణాన్ని అలుముకున్నాయి. సోమవారం వారోత్సవాలతో పాటు వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో వేణుగోపాల స్వామివారికి వైభవంగా కల్యాణం నిర్వహించారు. బలబ్రహ్మేశ్వర స్వామివారి ఉత్సవ మూర్తులను రథంపై ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. అనంతరం దశవిధహారతులు అందజేశారు. భక్తులకు తీర్థ, ప్రసాదాల వితరణ చేశారు.

ఆలయంలో ప్రముఖులు

జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాలను సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఇందులో ఆర్అండ్‌బీ చీఫ్ ఇంజినీర్ మోహన్‌నాయక్, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, ఏపీ ఎలక్షన్ కమిషన్ జాయింట్ సెక్రటరి జి.వి సాయిప్రసాద్ తదితరులు వేర్వేరు సమయాల్లో ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా ఎదుర్కోళ్ల ఉత్సవం

నేడు జములమ్మ కల్యాణోత్సవం



ఆలయ ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం

గద్వాలటౌన్: నడిగడ్డ ఇలవేల్పు జములమ్మ కల్యాణ మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల ఉత్సవాలలో భాగంగా సోమవారం సాయంత్రం చేపట్టిన ఎదుర్కోళ్ల ఉత్సవం అత్యంత వైభంగా సాగింది. అమ్మవారిని పెళ్లి కుమార్తెను చేశారు. అంతకుముందు ఆలయంలో అర్చకులు, వేద పండితులు ప్రత్యేక పూజలతో ఉత్సవాలను ప్రారంభించారు. ధ్వజరోహణం, గణపతి పూజ నిర్వహించారు. జమ్మిచేడు శివాలయం నుంచి ఎదుర్కోళ్లను ప్రారంభించి కళాకారులతో గంగతెప్ప, పుట్ట బంగారాన్ని అర్చకులు, ధర్మకర్తలు ఆలయానికి తీసుకొచ్చారు. డప్పు వాయిద్యాల మేళతాళాలతో భక్తుల కోలాహలం నడుమ ఊరేగింపు నిర్వహించారు. పోతురాజుల నృత్యాలు, విన్యాసాలతో సందడి నెలకొంది. మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, ఆలయ కమిటీ చైర్‌పర్సన్ గాయత్రి, ఈఓ పురేందర్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు.

నేడు కల్యాణం

ఏటా శ్రావణ మాసంలో చివరి మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించే అమ్మవారి కల్యాణోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ వేడుకను కనులపండువగా నిర్వహించేలా ఆలయ పాలకవర్గం, అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే పలుసార్లు ఏర్పాట్లు పరిశీలించారు. అన్ని విభాగాల అధికారులను అప్రమత్తం చేశారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ కల్యాణ వేదిక ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశారు. ఉదయం 12.15 గంటలకు జరిగే కల్యాణోత్సవానికి ముందు ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి దంపతులు అమ్మవారికి ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు తీసుకురానున్నారు.



జములమ్మ ఆలయంలో ధ్వజారోహణం నిర్వహిస్తున్న అధికారులు

పోస్టుమార్టం నిర్వహణలో జాప్యం

ఆస్పత్రి వద్ద బాధిత కుటుంబ సభ్యుల ఆందోళన



ఆస్పత్రిలో ఆవరణలో బైఠాయించిన బాధిత కుటుంబ సభ్యులు

జడ్చర్ల: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం మాట అటుంచితే చివరకు పోస్టుమార్టం చేసేందుకు బాధితులు ఆందోళన చేసే పరిస్థితి నెలకొంది. మండలంలోని పరిధిలోని బూర్గుపల్లికి చెందిన పోలే వెంకటయ్య రెండు రోజుల క్రితం వ్యవసాయ కూలీ పనులకు వెళ్లి తిరిగి రాలేదు. ఆదివారం పొలం వద్ద అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉండడాన్ని గుర్తించి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆదివారం బాదేపల్లి పాత ఆస్పత్రిలో మార్చురీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అయితే ఆ రోజు సమయం మించి పోయిందంటూ పోస్టుమార్టం చేయలేమని డాక్టర్లు చెప్పడంతో వెనుతిరిగి వెళ్లిపోయారు. సోమవారం పోస్టుమార్టం కోసం ఆస్పత్రి వద్ద ఎదురు చూసినా డాక్టరు రాకపోవడంతో గంగాపూర్ ప్రధాన రహదారి ప్రాంతంలో కొత్తగా నిర్మించిన ఆస్పత్రి వద్దకు బంధువులు, గ్రామస్తులు చేరుకుని పోస్టుమార్టం కోసం డాక్టరును అభ్యర్థించారు. రోగులు ఉన్నారని పోస్టుమార్టం కోసం వేచి చూడాలని డాక్టర్ చెప్పడంతో కొంత సేపు ఎదురు చూశారు. అయినా రాకపోవడంతో బాధితులు ఆందోళనకు దిగారు. ఇంత పెద్ద ఆస్పత్రిలో ఒక్క డాక్టరే ఉన్నారా.. పోస్టుమార్టం కోసం ఎంత సేపు వేచి చూడాలంటూ నిరసన వ్యక్తం చేశారు. విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే ఆయన స్పందించారు. పోస్టుమార్టం చేసి ఇబ్బందులు కలగనీయకుండా చూడాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రకళను ఎమ్మెల్యే ఆదేశించడంతో వెంటనే చర్యలు చేపట్టారు.

మంత్రులను కలిసిన డీసీసీబీ చైర్మన్



ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కతో డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి: ఇటీవల మహబూబ్‌నగర్ డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నికైన మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సోమవారం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును మర్యాద పూర్వకంగా కలిశారు. తొలిసారి వనపర్తి ప్రాంత వాసికి చైర్మన్ పదవి దక్కిందని ఎమ్మెల్యే మంత్రులకు వివరించారు. పాలమూరు డీసీసీబీ డైరెక్టర్లలో అత్యధికులు బీఆర్ఎస్ చెందిన వారే ఉన్నా.. చైర్మన్ పీఠంను కాంగ్రెస్ ఖాతాలో వేసేందుకు అందరి సహకారంతో ప్రయత్నించినట్లు మంత్రులకు వివరించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సహకార సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం తరుపున తోడ్పాటు కావాలని మంత్రులను డీసీసీబీ చైర్మన్ కోరారు.

ఎలుగుబంటి సంచారం

గద్వాల క్రైం: పట్టణంలోని న్యూ హౌసింగ్ బోర్డు కాలనీలో సోమవారం సాయంత్రం 8గంటల సమయంలో ఎలుగు బంటి సంచారించినట్లు కాలనీ వాసులు గుర్తించారు. పరిసర ప్రాంతాల్లో వ్యవసాయ పొలాలు ఉండడంతో ఎలుగు బంటి అటువైపు వెళ్లిందన్నారు. దీంతో కాలనీ వాసులు భయాందోళనకు గురైయ్యారు. విషయాన్ని గద్వాల పోలీసు, ఫారెస్టు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రాత్రి సమయం కావడంతో ప్రజలెవరూ బయట తిరగవద్దని అధికారులు కాలనీప్రజలకు హెచ్చరించారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌పై ఫిర్యాదు

మహబూబ్‌నగర్ క్రైం: తప్పుడు పత్రాలు సృష్టించి అక్రమంగా పదుల సంఖ్యలో ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేశాడని కౌన్సిలర్‌పై రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చారు. వివరాల్లోకి వెళితే.. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో ఓ కౌన్సిలర్ కొన్ని రోజుల నుంచి తప్పుడు పత్రాలు సృష్టించి, ఒకరి నుంచి మరొకరి పేరుతో నకిలీ పత్రాలు తయారు చేసి అమాయక ప్రజలకు క్రయవిక్రయాలు చేశాడని సోమవారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఇద్దరు బాధితులు ఫిర్యాదు ఇచ్చినట్లు సమాచారం. దీనిపై రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా ఫిర్యాదు ఇచ్చారని, ఎలాంటి కేసు నమోదు చేయలేదని వెల్లడించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పింది

- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ



మక్తల్‌లో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

మక్తల్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాటను తప్పిందని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ విమర్శించారు. పట్టణంలో పలు కార్యక్రమాలకు హాజరైన అనంతరం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అఖిలారెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎంపీ మాట్లాడారు. చెప్పిన ఆరు గ్యారంటీల్లో ఏది అమలవుతుందో అర్థంకాని పరిస్థితి ఉందన్నారు. రుణామాఫీపై కాకిలెక్కలు వేసుకుంటున్నారని తెలిపారు.రుణమాఫీ పూర్తిగా అమలు చేసే అవకాశం లేదన్నారు. ప్రభుత్వాలు మారితే ఎక్కడ అక్రమ నిర్మాణాలు, ఇసుక దందాలు గుర్తుకు వస్తాయా అని అన్నారు. రాష్ట్రం అప్పుల పాలైందని నాటకాలు ఆడుతున్నారని, రూ.40వేల కోట్లల్లో ఎంత మందికి రుణమాఫీ చేశారో చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు రూ.2,500, పింఛన్ రూ.4వేలు, కల్యాణలక్ష్మి కింద రూ.లక్ష, తులం బంగారం, డిగ్రీ కళాశాల అమ్మాయిలకు స్కూటీలు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. 111 జీఓను కొనసాగించాలని, తొందరపాటు నిర్ణయాలతో వేరొకరిని బలి పశువులను చేయొద్దన్నారు. సంగంబండ, భూత్పూర్ రిజర్వాయర్ కింద ముంపునకు గురైన బాధిత కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఆర్అండ్ఆర్ సెంటర్ల పనులను వెంటనే చేపట్టి బాధితులకు న్యాయం చేయాలన్నారు. మక్తల్ డిగ్రీ కళాశాలలో మౌలిక వసతులు లేక విద్యార్థులు నేలపై కూర్చుంటున్నారని తెలిపారు. గ్రామాల్లో పీఎంశ్రీ పథకం కింద పాఠశాలలకు రూ.కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. బడుగువర్గాల సంక్షేమం కోసం మోదీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కొండయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, రవికుమార్, బాల్‌రాంరెడ్డి, ప్రసన్నరెడ్డి, రవీందర్‌రెడ్డి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేలుళ్ల ధాటికి.. పొక్లెయిన్ డ్రైవర్ మృతి



చెల్లాచెదురుగా పడిపోయిన పొక్లెయిన్

గట్టు: మండలంలోని సల్కాపురం, జోకన్‌గట్టు మధ్యన ఉన్న గుట్టలో జరిపిన పేలుళ్లలో మధ్యప్రదేశ్‌కు చెందిన పొక్లెయిన్ డ్రైవర్ విజయ్ కుమార్‌సింగ్ గోండు (34)పై బండరాళ్ల పడడంతో మృతి చెందాడు. ఆదివారం రాత్రి ఘటన చోటు చేసుకోగా సోమవారం వెలుగు చూసింది. గ్రామస్తులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా.. భారత్‌మాల రోడ్డు నిర్మాణం కోసం జోకన్‌గట్టు గుట్ట వద్ద హైదరాబాద్‌కు చెందిన ఓ కంపెనీ క్రషర్‌లో పొక్లెయిన్ డ్రైవర్‌గా విజయ్‌కుమార్‌సింగ్ గోండు పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి 7:30 గంటల ప్రాంతంలో క్రషర్‌కు కొద్ది దూరంలో పేలుళ్లు జరిపారు. పెద్ద బండరాళ్లు ఎగిరి చెల్లాచెదురుగా పడ్డాయి. అక్కడే కొద్దిదూరంలో పనిచేస్తున్న పొక్లెయిన్‌పై బండరాళ్ల పడడంతో అందులో డ్రైవర్‌గా ఉన్న విజయ్‌కుమార్ సింగ్ అక్కడిక్కడే మృత్యువాత పడ్డాడు. కొద్ది సేపటి తర్వాత అక్కడున్న వారు దగ్గరకు వెళ్లి చూడగా నడుము భాగం, కాళ్లపై రాళ్లు పడి మృతి చెందినట్లు గుర్తించారు. పేలుళ్లు జరిపే చోట ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండానే నిర్వహించారని, మృతుడి పెద్దనాన్న రాజేందర్‌సింగ్‌గోండు పోలీసులకు అందజేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు. పేలుళ్లకు సంబంధించి ఎలాంటి అనుమతులు లేకుండానే పగలు, రాత్రి తేడా లేకుండా పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. పేలుళ్ల కారణంగా ఇళ్లు దెబ్బతింటున్నా పట్టించుకోవడం లేదని జోకన్‌గట్టు, సల్కాపురం గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

మూఢ నమ్మకాలపై అవగాహన అవసరం

- జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కోయ వెంకటేశ్వరరావు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మూఢ నమ్మకాలను నిర్మూలించేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కోయ వెంకటేశ్వరరావు తెలిపారు. జేవీవీ జిల్లా కార్యవర్గం ఎన్నిక కార్యక్రమం జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీ సమావేశం మందిరంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాణమతి, చేతబడి వంటి మూఢ నమ్మకాలతో అమాయకులు బలైపోతున్నారని, వీటిని అరికట్టాలంటే చదువుకున్న వారు వీటిపై అవగాహన కల్పించాలన్నారు. జేవీవీ కార్యకర్తలు గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో వీటిపై పూర్తి స్థాయిలో వివరించాలన్నారు. ఈ మేరకు జిల్లా గౌరవ అధ్యక్షులుగా మధుసూదన్, రాంరెడ్డి, కురుమూర్తి, అధ్యక్షుడిగా ప్రహ్లాద్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా అశోక్‌కుమార్‌గౌడ్ తదితరులను ఎన్నుకున్నారు.

11 యూనిట్లలో విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తి వేగవంతంగా కొనసాగుతుంది. సోమవారం 11 యూనిట్లలో ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈలు రామసుబ్బారెడ్డి, సురేష్ తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, 112 మిలియన్ యూనిట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, 88 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేపడుతున్నారు. ఇప్పటి వరకు 200 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని సాధించామని తెలిపారు. ప్రస్తుతం 32వేల క్యూసెక్కుల నీటిని వినియోగించి దిగువ శ్రీశైలంకు వదులుతున్నామని తెలిపారు.


శ్రీశైలంలో 884 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో సోమవారం 884 అడుగుల నీటిమట్టం వద్ద 210.0320 టీఎంసీల నీటినిల్వ ఉంది. జూరాలలో ఆనకట్ట గేట్లు పైకెత్తి స్పిల్‌వే ద్వారా 98,088, విద్యుదుత్పత్తి చేస్తూ 31,913, సుంకేసుల నుంచి 2,280 మొత్తం 1,32,281 క్యూసెక్కుల నీటిప్రవాహం శ్రీశైలం జలాశయం వస్తున్నాయి. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 37,882, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 28,169 మొత్తం 66,041 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 30వేలు, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 1,196, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,460 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 16.823 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు. కుడిగట్టు కేంద్రంలో 7.893 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేశారు.

సుంకేసులకు తగ్గిన ఇన్‌ఫ్లో

రాజోళి: సుంకేసుల డ్యాంకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో భారీగా తగ్గుముఖం పట్టింది. సోమవారం ఎగువ నుంచి 4,725 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, ఒక గేటును తెరిచి 2,280 క్యూసెక్కులను దిగువకు వదిలి కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు వదిలినట్లు జేఈ రాజు తెలిపారు. ప్రస్తుతం డ్యాంలో 1.235 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

పెరుగుతున్న కోయిల్‌సాగర్ నీటిమట్టం



కోయిల్‌సాగర్ ప్రాజెక్టు

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం పెరుగుతుంది. సోమవారం సాయంత్రం వరకు ప్రాజెక్టులో 23.4 అడుగులకు చేరింది. ప్రాజెక్టు అలుగుస్థాయి 26.6 అడుగులు కాగా మరో 3.2 అడుగుల నీరు చేరితే నిండిపోతుంది. గేట్ల స్థాయి నీటి మట్టం 32.6 అడుగులుగా ఉండగా మరో 9.2 అడుగుల నీరు చేరితే గేట్లను తెరిచే అవకాశం ఉంది. ప్రస్తుతం జూరాల నుంచి ఎత్తి పోతల పథకం ద్వారా కోయిల్‌సాగర్‌కు నీటిని పంపింగ్ చేస్తున్నారు. గత నెల చివరివారం నుంచి కుడి ఎడమ కాల్వల ద్వారా ఆయకట్టు భూములకు నీటిని వదులుతూ వచ్చారు. నెల రోజుల పాటు నిరంతరం నీటిని వదిలిన తర్వాత ప్రస్తుతం కాల్వలను మూసివేశారు. పూర్తిస్థాయిలో నిండిన తర్వాత తిరిగి వానాకాలం పంటలకు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది.

పెద్దవాగు ప్రవాహం లేక..

గతేడాది ఆగస్టులోనే కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండి గేట్లను తెరిచి నీటిని వదిలారు. ఈ ఏడాది ఇప్పటి వరకు ప్రాజెక్టు నిండకపోవడంతో గేట్లను తెరవలేదు. ప్రాజెక్టుకు పెద్దవాగు నుంచి ప్రవాహం వస్తే ఒకటి రెండు రోజుల్లోనే నిండే అవకాశం ఉంటుంది. ఈ వానాకాలం జిల్లాలో తగినంత వర్షం కురవక పోవడం వల్ల వాగుకు ప్రవాహం రాలేదు. పరిగి, దౌల్తాబాద్, కోస్గి, హన్వాడ తదితర ప్రాంతాలలో చెరువులు, కుంటలు నిండితే పెద్దవాగు ప్రవాహం వస్తుంది.